క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



సిద్ధాంతం మావుళ్లమ్మ జాతరలో నృత్య ప్రదర్శన ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతం గ్రామదేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి, జానపద నృత్యాలు అలరించాయి. నంది అవార్డు గ్రహీత సాయి కోమలి నృత్యాలు వీక్షకులకు కనువిందు చేశాయి. నృత్యాలు తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి మావుళ్లమ్మ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మహిళలు బారులు తీరారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు అనేక సేవా సంస్థల సభ్యుల సహకారం కూడా ఉంటుందని దాత కేశిరాజు కృష్ణ (గజల్స్ కృష్ణ) అన్నారు. శుక్రవారం పందిగుంట గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు స్టీల్ కంచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంచి విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నిల్లా సురేష్ బాబు, దొడ్డా ఏడుకొండలు, పాముల రజనీకుమార్, కేవీఆర్ మోహన్ పాల్గొన్నారు.

మేధో సంపత్తిపై ఆన్‌లైన్ వర్క్‌షాప్



మేధో సంపత్తి ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: మానవ జీవితం మెరుగుపరచడంలో మేధో సంపత్తి హక్కుల చట్టం ప్రాముఖ్యత ఎంతో ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులతో పరిశోధనలు చేసే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పూర్తి స్థాయి హక్కులు పొందిన తర్వాతనే వాటిని ప్రకటించాలని అప్పుడే ప్రచురణలు, ప్రయోగాలకు పూర్తిస్థాయిలో విలువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూకోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని 33/11 కేవి ఆగర్తిపాలెం, సగం చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం కొన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆగర్తిపాలెం, సగంచెరువు, వెలివల, గొల్లగూడెం, తిల్లపూడి, తిల్లపూడి పాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు.

రేపు తణుకులో జిల్లాస్థాయి రోల్‌బాల్ పోటీలు

తణుకు అర్బన్: నాల్గవ జిల్లాస్థాయి రోల్ బాల్ పోటీలు ఈనెల 29వ తేదీన తణుకు మునిసిపల్ స్కేటింగ్ పార్కులో నిర్వహించనున్నట్లు జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.లావణ్య తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు అండర్ 11, 14, 17 విభాగాలతో పాటు 17 సంవత్సరాలు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామని, అర్హులైన క్రీడాకారులు తమ పేర్లను శనివారంలోపుగా నమోదు చేసుకోవాలని వివరించారు. ఇతర వివరాలకు 9642331332 నంబరులో సంప్రదించాలని కోరారు.

వేంద్ర జెడ్పీ పాఠశాల సందర్శన

పాలకోడేరు: పాఠశాల ఎన్రోల్మెంట్‌లో భాగంగా వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్షణ ప్రాజెక్టు అధికారి పి.శ్యాంసుందర్ శుక్రవారం పాఠశాలను సందర్శించి పాఠశాలలో ముగ్గురు విద్యార్థులను ఎన్రోల్ చేశారు. అనంతరం హెచ్ఎం జీవీవీ శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను విద్య ద్వారా మాత్రమే తొలగించవచ్చన్నారు. ఈ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సీఎంఓ చంద్రశేఖర్, ఏఎంఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ శివన్నారాయణ, ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల లేమి

- పట్టించుకోని అధికారులు, నాయకులు
- అవస్థలుపడుతున్నామని లబ్ధిదారుల ఆవేదన



చిట్టడవిని తలపిస్తున్న దొంగగూడెంలోని జగనన్న కాలనీ

పెనుగొండ: జగనన్న కాలనీలు నిర్లక్ష్యపు నీడలో మౌలిక సదుపాయాల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇంటికి చేరాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. పెనుగొండలోని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం వద్ద దొంగ గూడెంలో జగనన్న కాలనీలో 220 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 100కు పైగా ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. దీంతో పాటు గత ప్రభుత్వం ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేసి, కాలనీలోనే సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. దీంతో పాటు జలజీవన్ మిషన్‌లో వాటర్ పైపు లైను నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఇళ్ల నిర్మాణంలో పైపులైను నిర్మాణం పూర్తిగా పాడైపోయింది. విద్యుత్ సదుపాయం సైతం ఏర్పాటు చేశారు.

కూటమి ప్రభుత్వం శీతకన్ను

కూటమి ప్రభుత్వం కాలనీలోని సదుపాయాల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో కాలనీవాసులు సొంత ఖర్చులతో కాలనీ మధ్యలో రాకపోకలకు వీలు కలిగే విధంగా రహదారి నిర్మించుకొన్నారు. ఇదిలా ఉండగా కాలనీలో నివాసితుల సంఖ్య పెరగడంతో మురుగు డ్రెయిన్ల సదుపాయం లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో దోమల వ్యాప్తి పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కాలనీ మొత్తం చిట్టడవిలా తయారైంది. దీంతో పాముల బెడద పెరిగిపోతుందని తెలిపారు. రాత్రి వేళల్లో కనిపించక బయటకు వెళ్లాలంటే భయం వేస్తుందని వాపోయారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా పైపు నిర్మాణాలు పూర్తి చేసినా, నిర్మాణాల సమయంలో పాడైపోవడంతో తిరిగి మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. దీంతో దూర ప్రాంతాల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కాలనీపై దృష్టి సారించి సదుపాయాల కల్పన చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మౌలిక సదుపాయాలు లేక మధ్యలోనే నిలిచిపోయిన ఇంటి నిర్మాణం



సొంత ఖర్చులతో కాలనీ వాసులు నిర్మించుకున్న దారి

పెనుగొండ ఫ్లై ఓవర్‌పై రాకపోకల పునరుద్ధరణ



మరమ్మతులు పూర్తయిన పెనుగొండ ఫ్లై ఓవర్

పెనుగొండ: పెనుగొండ ఫ్లై ఓవర్‌పై రాకపోకలు శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ తెలిపారు. నెలకు పైగా ఫ్లై-ఓవర్ మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మరమ్మతుల కోసం రాకపోకలను నిషేధించారు. దీంతో పాటు నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో పూర్తిగా ఆర్టీసీ, భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఆచంట మీదుగానూ, ఆలమూరు మీదగానూ రాకపోకలు సాగించాయి. 10 రోజుల క్రితం నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో మార్టేరు నుంచి పెనుగొండకు కార్లు, ఆటోల రాకపోకలకు అనుమతులు ఇచ్చారు. ఆర్టీసీ, లారీలకు అనుమతులు ఇవ్వలేదు. అయినా లారీలు యథావిధిగా పెనుగొండ గ్రామం మధ్య నుంచి రాకపోకలు సాగించాయి. బస్సులు మాత్రం రాకపోవడంతో కళాశాల విద్యార్థులు, పెనుగొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ తరుణంలో శనివారం నుంచి రాకపోకలకర అనుమతులు ఇస్తున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించడంతో బస్సుల రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నాయి.

దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అంగన్‌వాడీలతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నరసాపురం రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 7న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుతాళ్ల గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని గంటలు పెంచడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.వెంకటలక్ష్మి, ఎం.బోగేశ్వరి, జీకే ముత్యాలమ్మ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

నరసాపురం రూరల్: సీతారాంపురం స్వర్ణాంధ్రలో పాలీసెట్ 2025 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 21 నుంచి వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ నెల 28 తో మొదటి ఫేజ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని కళాశాల ప్రిన్సిపాల్, హెల్ప్ లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30 నుంచి వెబ్‌ఆప్షన్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మహిళా చైర్‌పర్సన్‌కు మర్యాద ఇవ్వరా?

- కౌన్సిల్ సమావేశంలో మహిళా వీసీ, కూటమి కౌన్సిలర్ల మధ్య వాదనలు
- మూడుసార్లు వాయిదా వేసిన చైర్‌పర్సన్



సమావేశంలో సభ్యుల వాగ్వివాదం



నేలపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సభ్యుల వాదోపవాదాలు, వ్యక్తిగత విమర్శలతో దద్దరిల్లింది. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ సభ్యురాలు కామన నాగిని కనీసం మహిళా సభ్యురాలినని కూడా చూడకుండా ఓ స్వతంత్ర కౌన్సిలర్ కోటిపల్లి సురేష్, ఇటీవలే వైఎస్సార్ సీపీ నుంచి కండువామార్చి టీడీపీలో చేరిన మరో సభ్యుడు కేసరి గంగరాజుల వ్యవహార తీరు అభ్యంతరకరంగా ఉందంటూ సమావేశంలో ఆందోళనకు దిగారు. చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లింది. ఇదే సందర్భంలో కొందరు సభ్యులు కొందరు వ్యక్తిగత విమర్శలకు ఒకరినొకరు పూనుకోవడంతో సమావేశం రసాభాసగా మారింది. సభ్యులను శాంతం పరిచి, సభ సజావుగా సాగించే ప్రయత్నంలో చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సమావేశాన్ని మూడుసార్లు వాయిదా వేసినా లాభం లేకపోయింది. వాయిదా అనంతరం కూడా ఇదే పరిస్థితుల్లో సమావేశం గందరగోళంగా సాగింది. మొత్తంగా గురువారం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది.

డ్రెయిన్ సిల్ట్ తీత పనులపై వివాదం

ఇటీవల పట్టణంలో డ్రెయినేజీ సిల్ట్‌తీత పనుకు వచ్చిన కార్మికులకు వసతి, తనవార్డులో ఉన్న లెనిన్ హైస్కూల్‌లో ఇవ్వడంపై కామన నాగిని అభ్యంతరం చెప్పారు. కార్మికులు స్కూల్ రూమ్స్‌ను పాడు చేశారని, విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించారు. కార్మికులకు వసతి కాంట్రాక్టర్ చూసుకోవాలి గానీ, స్వయంగా కమిషనర్ వెళ్లి స్కూల్ రూమ్స్ తాళాలు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. అయితే దీనికి కమిషనర్‌ను సమాధానం కోరాగా, మధ్యలో స్వతంత్ర కౌన్సిలర్ కోటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, టీడీపీ సభ్యుడు పాలూరి బాబ్జి కమిషనర్ చర్యను సమర్థిస్తూ మాట్లాడటంపై నాగిని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషర్ బదులు మీరు సమాధానం చెబుతున్నారు ఏంటి? అని ప్రశ్నించారు. ఈ క్రమంలో సురేష్, గంగరాజులతో నాగిని వాగ్వివాదానికి దిగారు. ముగ్గురు మధ్య ఏకవచన సంభాషణలతో కేకలు, అరుపులు చోటుచేసుకున్నాయి. మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అలాగే చేశారని కూటమి ఆరోపించడంతో నాగిని మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రభుత్వ హయాంలో చాలా హుందాగా వ్యవహరించామని చెప్పారు. దీనిపై నాగిని అసహనం వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. దీంతో గంటన్నరపాటు సమావేశంలో హైడ్రామా నడిచింది. సిల్ట్‌తీత పనులు దారుణంగా, అధ్వానంగా సాగాయని వన్నెంరెడ్డి శ్రీనివాస్, సఖినేటిపల్లి సురేష్, బొంతు రాజశేఖర్, జిల్లెళ్ల దిలీప్, మరో వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతుండగా, సిల్ట్‌తీయడం వల్ల మట్టి మళ్లీ డ్రెయినేజీల్లోకే పోయిందన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లు పెండింగ్ పెట్టాలని కోరగా కమిషనర్ అంగీకరించారు.

సమావేశాలు జరుగుతున్న తీరు బాధాకరం

సమావేశంలో గొడవలు, కేకలు, గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో కో-ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ తన ఆవేదనను సమావేశంలో వ్యక్తం చేశారు. ఊరికే కేకలు వేసుకుంటూ ప్రజలకు ఉపయోగంలేని అంశాల్లో గొడవలు పడటం మంచిదికాదన్నారు. ప్రజలు మనల్ని పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని కౌన్సిల్‌కు పంపారన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. కమిషనర్ ఇతర అధికారులు చేస్తున్న పొరపాట్లు, అసమర్థ పాలన వల్ల పట్టణ అభివృద్ధి వెనక్కి వెళ్లిపోయిందన్నారు. పుష్కరాలకు ఎక్కువ నిధులు ఎలా తెచ్చుకోవాలి? పట్టణాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి? అనే అంశాలపై చర్చలు సాగితే ఉపయోగం ఉంటుంది కానీ, ఇలాంటి గొడవల వల్ల ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేసి కొద్దిసేపటి తరువాత సమావేశం నుంచి వెళ్లిపోయారు. వేసవిలో ప్రజలు తీవ్ర మంచినీటి ఎద్దడి ఎదుర్కొన్నారని అలాంటి సమస్యలపై అధికారులను నిలదీయాలని వన్నెంరెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో బర్రి జయరాజు, యర్రా ఉమ, చిట్టూరి కృష్ణ, పతివాడ పద్మ, మల్లాడి శేషవేణి, ద్వారా గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన పశు సంచార వ్యాన్



ఏఎంసీ యార్డులో నిరుపయోగంగా ఉన్న యలమంచిలి వెటర్నరీ వ్యాన్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర పశు సంవర్ధకశాఖ సంచార పశు ఆరోగ్యసేవ పేరుతో మొబైల్ వెటర్నరీ వ్యాన్‌లను ఏర్పాటు చేశారు. ఇవి నియోజకవర్గానికి రెండు వ్యాన్‌లను కేటాయించారు. ఈ మొబైల్ వెటర్నరీ వ్యాన్‌లు నియోజకవర్గంలో పశు వైద్యులు అందుబాటులో లేని ప్రాంతాల్లో అలాగే పశు వైద్యశాలలు లేని ప్రాంతాలకు అత్యవసర సమయాల్లో వెళ్లి పశువులకు వైద్య సేవలందించి వస్తుంటారు. 1962కు కాల్ చేస్తే వెంటనే స్పందించి మొబైల్ వ్యాన్‌ల ద్వారా అక్కడకు వెళ్లిన సిబ్బంది పశువులకు చికిత్స చేసి వస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులకు వ్యాధుల సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో అందుబాటులో ఉండాల్సిన పశు సంచార మొబైల్ వ్యాన్‌లు వివిధ మరమ్మతులతో మొరాయిస్తున్నాయి. నియోజకవర్గంలో యలమంచిలి మండలానికి చెందిన పశు సంచార మొబైల్ వ్యాన్ గత వారం రోజులు నుంచి గేర్‌బాక్స్ మరమ్మతులు రావడంతో పట్టణంలో అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసి ఉంచారు. ఈ వ్యాన్‌లో ఉన్న హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా పశువులను వ్యాన్‌ల్లోకి ఎక్కిస్తారు. కానీ ఈ హైడ్రాలిక్ పనిచేయకపోవడంతో వ్యాన్‌లు ఉన్నా ఉపయోగం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఈ వ్యాన్‌లు మరమ్మతులు వచ్చినప్పుడు జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కంపెనీ చేసేది. వాళ్ల టెండర్ రద్దు కావడంతో ప్రస్తుతం భవ్య హెల్త్ సర్వీసెస్ సంస్థ మరమ్మతులు చేస్తున్నాయి. మరమ్మతులు వేగంగా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

కొబ్బరి చెట్ల ఫలసాయం కోసం వేలం



మల్లిపూడిలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో కొబ్బరి చెట్ల ఫలసాయం పొందేందుకు శుక్రవారం పంచాయతీ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో కోనప్ప చెర్వుగట్టు, అర్జునుడుపాలెం చెర్వు బోదెగట్టుపై ఉన్న సుమారు 330 కొబ్బరిచెట్లు ఫలసాయం పొందేందుకు వేలం నిర్వహించగా కోనప్ప చెరువు గట్టు చెట్లను రూ. 4.31 లక్షలకు, జుత్తిగ గ్రామానికి చెందిన కండెల్లి కృష్ణ, అర్జునుడుపాలెం బోదెగట్ల చెట్లను రూ. 37 వేలకు అర్జునుడుపాలెం గ్రామానికి చెందిన కర్రిసత్తిరెడ్డి వేలంలో దక్కించుకున్నారు. మూడేళ్ల పాటు ఈ చెట్లపై ఆదాయాన్ని పొందే విధంగా వేలం నిర్వహించారు. పంచాయతీలో పేరుకుపోయిన పాత ఇనుప చెత్తను కూడా వేలం వేయగా గ్రామానికి చెందిన కాపా డెక్కలయ్య రూ.23 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈఓపీఆర్డీ సీతారామయ్య, సర్పంచ్ దొంగ మహాలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడిమెట్ల సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెంటపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం గూడెం వీకర్స్ కాలనీకి చెందిన మానుపాటి జయరాజు (40) చేపలు, రొయ్యల కొనుగోలు వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈనెల 21న పని నిమిత్తం గూడెం నుంచి పరిమెళ్ల మీదుగా భీమవరం మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. పరిమెళ్ల వద్ద గుర్తుతెలియని వాహనం జయరాజును ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఈతనిని స్థానికులు గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రియాఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ జయరాజు శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అర్హత కలిగిన కౌలు రైతులు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్) కార్డులు అంటే కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కౌలు కార్డుల కోసం సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. అర్హులైన కౌలు రైతులు తమ యజమాని భూమి వివరాలు అనగా ఆర్‌ఓఆర్ 1-బి, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో పాటు అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుని వీఆర్‌ఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి కౌలు రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవాలి

యలమంచిలి: విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవడానికి రెండు రోజులు మాత్రమే గడువుందని ఎలక్ట్రికల్ ఏఈ మురళీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేవారు. వినియోగదారులంతా పూర్వం విద్యుత్ కనెక్షన్ తీసుకున్న సమయంలో తీసుకున్న లోడునే ఇప్పటికీ వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ప్రతి ఇంటిలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఆ మేరకు విద్యుత్ లోడును పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు 50 శాతం సబ్సిడీతో లోడు పెంచుకోవడానికి గడువుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రామలింగేశ్వరుని సేవలో ఏఏఓ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని జిల్లా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ మధు బాబు దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయానికి విచ్చేసిన మధుబాబు స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. ఈయన వెంట సీతారామస్వామి, ఆర్.అరుణదేవి, ఆలయ సూపరింటెండెంట్ వాసు ఉన్నారు.

సంపద సృష్టి ఏమైంది చంద్రబాబు?

మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ



కార్మికులకు మద్దతు తెలుపుతున్న చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

నరసాపురం: అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గొప్పగా చెప్పి, ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చి మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 5 రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికుల రిలే దీక్షా శిబిరాన్ని గురువారం చైర్‌పర్సన్ తోటి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లుతో కలసి సందర్శించి సంఘీభావం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో ఉద్యోగులు, కార్మికుల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఆందోళనలో న్యాయముందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, యర్రా ఉమ, పతివాడ పద్మ, చిట్టూరి పద్మ, ద్వారా గంగాభవానీ, జిల్లెళ్ల దిలీప్, సఖినేటిపల్లి సురేష్, మల్లాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మానాపురానికి బీవీ రావు కళాసేవ పురస్కారం



బీవీ రావు కళా పురస్కారం అందుకుంటున్న మానాపురం

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన కళాకారుడు పాలకొల్లు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ బీవీ రావు కళాసేవ పురస్కారం అందుకున్నారు. గురువారం గుంటూరు బృందావనం గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై అత్యంత వైభవంగా పురస్కార సమావేశం నిర్వహించారు. గుంటూరుకు చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థలం కళాకారులు బివిరావు స్మారకార్థం బీవీ రావు కళాసేవ పురస్కారాలను నాటక రచయిత దర్శకులు కళారత్న కావూరి సత్యనారాయణ చేతులమీదుగా అందుకున్నట్లు మానాపురం తెలిపారు. పురస్కారం అందుకున్న మానాపురం సత్యనారాయణను పట్టణ కళాపరిషత్ సభ్యులు కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు, జక్కంపూడి కుమార్, కేఎస్‌పీఎస్ వర్మ, విటాకుల రమణ, కొణిజేటి గుప్త, దాసరి నాని, రెడ్డి వాసు, పీర్ సాహెబ్ తదితరులు అభినందించారు.

జీలుగతో జింకు ధాతులోపం నివారణ



జీలుగను పరిశీలిస్తున్న ఏఓ మధు మోహన్

ఆకివీడు: వరి చేలల్లో జింకు ధాతులోపం, చౌడు నివారణ వంటి వాటితో పాటు, నేలల్లో పోషకాల సమతుల్యం చేయడానికి పచ్చిరొట్ట, నవధాన్యాల సాగు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి మధు మోహన్ సూచించారు. మండలంలోని కుప్పపూడి గ్రామంలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు సాగు చేసిన నవధాన్యాలు, జీలుగ పచ్చిరొట్ట సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రసాయినక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించేందుకు పచ్చిరొట్ట సాగు మంచి ఫలితాల్ని ఇస్తుందన్నారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకురాలు లావణ్య ఉన్నారు.